నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 15 మే 2024 | PEDDAPALLI

అంతుచిక్కని లెక్కలు..

పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో భిన్న పరిస్థితి

ఆందోళనలో నేతలు

- గతంతో పోలిస్తే పెరిగిన ఓటింగ్ శాతం
- పోలింగ్ మొదలైనప్పటి నుంచే ఉత్కంఠ
- అంచనాల్లో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు
- కూడికలు, తీసివేతల్లో తలమునకలు
- పల్లెల్లో పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభమన్న చర్చలు
- ఒకే సమయంలో వేర్వేరు నివేదికలు
- జూన్ 4 వరకూ తప్పని ఎదురుచూపులు
- కౌంటింగ్ ఏర్పాట్లలో యంత్రాంగం
- స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు నాడి రాజకీయ పార్టీలకు అంతుపట్టడం లేదు. ఈ సారి పల్లె ప్రాంతాల్లో ఓటింగ్ పెరగడం.. పట్టణ ప్రాంతాల్లో తగ్గడం ఊహకు అందడం లేదు. పలుచోట్ల అంచనాలకు మించి పోలింగ్ కావడం లెక్కలకు చిక్కడం లేదు. ఇదే సమయంలో క్షేత్రస్థాయి నుంచి వస్తున్న భిన్న సమాధానాలు ఆయా పార్టీల అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. 'తప్పకుండా మనమే గెలుస్తున్నా'మంటూ కొంత మంది ధీమా వ్యక్తం చేస్తున్నా.. అదే సమయంలో మరికొంత మంది 'మన గెలుపు కష్టమే'నంటూ నివేదికలు ఇవ్వడం అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. పోలింగ్ మొదలైనప్పటి నుంచే వస్తున్న రిపోర్ట్‌లను అనుసరించి ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడికలు తీసివేతల్లో బీజీబీజీగా గడుపుతున్నారు. జూన్ 4న భవితవ్యం తేలనుండగా ఉత్కంఠకు లోనవుతూ.. అంచనాల్లో మునిగితేలుతున్నారు. ఎన్ని సార్లు లెక్కలు వేసినా.. భిన్న రకాలుగా వస్తున్న ఫలితాలను చూసి ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అధికారులు కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తూనే.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కల్పించారు.



కరీంనగర్, మే 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం అంచనాలను దాటింది. గతంతో పోలిస్తే ఓటింగ్ శాతం పెరిగింది. ముఖ్యంగా పట్టణాల్లో ఓటింగ్ వినియోగించుకున్న తీరు గతంలో మాదిరిగానే ఉన్నా.. మండలాలు, గ్రామాల్లో మాత్రం హోరెత్తింది. నిజానికి ఎండలు దంచికొడుతున్న తరుణంలో పోలింగ్ తక్కువగానే నమోదవుతుందని అందరూ భావించారు. పోలింగ్‌కేంద్రాలకు పెద్దగా ఓటర్లు వచ్చే అవకాశముండదనే అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అయితే ముందు నుంచే అన్ని చోట్లా ఓటింగ్ పెంచేందుకు యంత్రాంగం భారీ కసరత్తే చేసింది. దాని ఫలితంగానే పోలింగ్ పెరిగినట్టు తెలుస్తున్నది. కారణాలు ఏవైనా ఓటు వినియోగం పెరగడం మంచి పరిణామమే అంటున్నారు నిపుణులు. అయితే పట్టణ ఓటర్లు మాత్రం ఓటు వినియోగంపై అలసత్వమే చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఉదాహరణకు పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో అతిపెద్ద పట్టణ ప్రాంతమున్న అసెంబ్లీ నియోజకవర్గం కరీంనగర్. ఈ సెగ్మెంట్‌లో మొత్తం 3,67,353 ఓటర్లకు గాను 2,22,296 మంది అంటే 60.51 శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలను చూస్తే ప్రతినియోజకవర్గంలోనూ 73 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అలాగే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. పెద్దపల్లిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్ద పట్టణాలైన మంచిర్యాల, రామగుండం నియోజకవర్గాలను చూస్తే.. మంచిర్యాలలో 60.84 శాతం, రామగుండంలో 61.59 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. ఏ కోణంలో చూసినా పట్టణాల కన్నా.. పల్లెలే బెటర్ అనే అభిప్రాయం వ్యక్తమైంది.

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం

సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
చెన్నూర్	1,93,778	1,32,787	68.53
బెల్లంపల్లి	1,76,514	1,25,255	70.96
మంచిర్యాల	2,78,738	1,69,591	60.84
ధర్మపురి	2,30,786	1,69,258	73.34
రామగుండం	2,19,723	1,35,330	61.59
మంథని	2,39,699	1,67,750	69.98
పెద్దపల్లి	2,57,192	1,83,482	71.31
మొత్తం	15,96,430	10,83,453	67.87

తేలని లెక్కలు

నిజానికి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో.. ఒక్కో రకమైన పోలింగ్ ట్రెండ్ కొనసాగింది. అంతేకాదు, సదరు సెగ్మెంట్‌లోని మండలాల్లోనూ విభిన్న కోణాల్లో ఓటింగ్ జరిగింది. కొన్ని గ్రామాలు ఒక పార్టీకి ఆయువు పట్టుగా నిలిస్తే.. మరికొన్ని గ్రామాలు మరో పార్టీకి అండగా నిలిచాయి. ఒక్కోచోట రెండు పార్టీల మధ్య పోటాపోటీగా పోలింగ్ సాగింది. వీటితోపాటు మెజార్టీ గ్రామాల్లో సైలెంట్ ఓటింగ్ నడిచిందన్న అభిప్రాయాలు ఎక్కువగా వ్యక్తమయ్యాయి. ఇదే సమయంలో పట్టణాల్లో కొన్ని పార్టీలకు పట్టుండగా.. పల్లెల్లో మరికొన్ని పార్టీలకు పట్టు ఉన్నది. ఈ పరిస్థితుల్లో పట్టణాల్లో తగ్గిన ఓటింగ్ ఏ పార్టీపై ప్రభావం చూపుతుందన్న విశ్లేషణలు నడుస్తున్నాయి. అలాగే, పల్లెల్లో పెరిగిన పోలింగ్ నేపథ్యంలో ఓటర్లు ఎవరి వైపు ఉన్నారన్నది పార్టీలకు అంతుచిక్కడం లేదు. క్షేత్రస్థాయి నుంచి మాత్రం భిన్నరకాల అభిప్రాయాలు వస్తున్నాయి. ఒక్కో పార్టీకి సంబంధించి మూడు నాలుగురకాల అభిప్రాయాలు వస్తున్నట్లు ఆయా పార్టీల ప్రధాన నాయకులు చెబుతున్నారు. 'కచ్చితంగా మనమే గెలుస్తా'మంటూ కొంత మంది చెబుతున్నా.. మరికొంత మంది మాత్రం మీరు గెలిచే చాన్స్ లేదని స్పష్టం చేస్తున్నారు. అలాగే.. చాలా సంస్థలు ఎగ్జిట్ పోల్ సర్వే చేశాయి. జూన్ ఒకటి వరకు ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధమున్న పరిస్థితుల్లో ఆయా పార్టీలు, నాయకులు ఎగ్జిట్‌పోల్స్ చేసిన సంస్థలకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ సంస్థలు కూడా భిన్న అభిప్రాయాలను ఆవిష్కృతం చేస్తున్నట్టు సమాచారం. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కలతో గడిపిన నాయకులు.. చివరకు ఎలా జరిగేదుంటే అలా జరుగుతుందంటూ సాయంత్రం కొంత మేరకు రిలాక్స్ అయినట్టు తెలుస్తున్నది.

స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న సిబ్బంది

ఈవీఎంలకు పటిష్ట భద్రత

పార్లమెంట్ పోలింగ్ సోమవారం సాయంత్రం ఆరు గంటలకే ముగిసింది. అందుకు సంబంధించి ఈవీఎంలను రాత్రి రెండుగంటలవరకు కౌటింగ్ కేంద్రాలకు చేర్చారు. పెద్దపల్లి కౌటింగ్ కేంద్రాన్ని రామగిరి మండలంలోని జేఎన్టీయూలో.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కౌటింగ్ కేంద్రాన్ని శ్రీ రాజరాజేశ్వర (ఎస్సారార్) డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నిజకవర్గాల వారీగా సంబంధిత ఈవీఎంలను భద్రపరిచిన అధికారులు.. అక్కడ అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మూడంచెల భద్రత కల్పించారు. పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని ఉన్నతాధికారుల మొబైల్స్‌కు అను సంధానం చేశారు. ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే.. క్షణాల్లో చేరుకునేలా భద్రాతా సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. అలాగే స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పహరా కోసం ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఫైరింజిన్లను అందుబాటులో ఉంచారు. కాగా, వచ్చే నెల 4న కౌటింగ్ ఉన్న నేపథ్యంలో అందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజవకర్గాల వారీగా మొత్తం ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కరీంనగర్	1,83,186	1,84,124	44	3,67,353
చొప్పదండి	1,12,858	1,20,682	6	2,33,546
వేములవాడ	1.08.091	1.18.065	32	2,26,188
సిరిసిల్ల	1,19,749	1,26,791	7	2,46,547
మానకొండూర్	1,10,075	1,15,310	1	2,25,386
హుజూరాబాద్	1,21,809	1,28,613	7	2,50,429
హుస్నాబాద్	1,21,715	1,25,981	5	2,47,701
మొత్తం	8,77,483	9,19,565	102	17,97,150

ప్రస్తుత కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
కరీంనగర్	1,11,596	1,10,680	20	2,22,296	60.51
చొప్పదండి	83,419	92,579	3	1,76,001	75.36
వేములవాడ	76.040	92.322	11	1.68.373	74.44
సిరిసిల్ల	88,722	96,847	4	1,85,573	75.27
మానకొండూర్	87,407	87,820	1	1,75,228	77.75
హుజురాబాద్	92,257	92,597	4	1,84,858	73.82
హుస్నాబాద్	95,222	96,137	2	1,91,361	77.25
మొత్తం	6,34,663	6,68,982	45	13,03,690	72.54

2019 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు

సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
కరీంనగర్	3,21,187	1,92,373	59.89
చొప్పదండి	2,23,342	1,60,831	72.01
వేములవాడ	2,05,979	1,45,641	70.71
సిరిసిల్ల	2,27,923	1,63,545	71.75
మానకొండూర్	2,11,856	1,60,154	75.60
హుజురాబాద్	2,23,850	1,57,916	70.55
హుస్నాబాద్	2,99,481	2,10,401	70.26
మొత్తం ఓట్లు	17,13,618	11,90,861	69.49

అత్యధిక సీట్లు గెలుస్తాం

- మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్లాం
- తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష
- కార్యకర్తల కృషి రేపటి స్థానిక సంస్థల ఎన్నికలకు పునాది
- ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- గులాబీ దళానికీ ధన్యవాదాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మాట్లాడుతున్న కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మే 14 (నమస్తే తెలంగాణ) / సిరిసిల్ల టౌన్/ గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట : 'కుట్రలు, కుతంత్రాలను లెక్కచెయ్యకుండా మొక్కవోని ధైర్యంతో గులాబీ దళం ముందుకెళ్లింది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోరాట పటిమను చాటింది. ప్రజల ఆశీర్వాదంతో అత్యధిక సీట్లు గెలుస్తాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేశామని, రేపు జరగబోయే జిల్లా పరిషత్, మండ పరిషత్, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు పునాదిరాయి అవుతుందని కార్యకర్తలకు భరోసా కల్పించారు. పదేండ్ల బీజేపీ ప్రభుత్వం, ఐదు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత చూస్తే రెండు కూటమిలకు స్పష్టమైన మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలే హవా కొనసాగించబోతున్నాయని, ప్రముఖ పార్టీలైన బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్‌లాంటి పార్టీలు, ప్రాంతీయ శక్తులే రేపు నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తాయన్నాని జోస్యం చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు గెలువబోదంటూ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రతో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ దిగరాక తప్పలేదని, ఆ పార్టీ నాయకత్వాలు తెలంగాణలో గింగిరాలు కొట్టాయని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడ్డ గులాబీ సైనికులకు ధన్యవాదాలు చెప్పారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌పై సరళిపై కార్యకర్తలతో చర్చించారు. అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలంటూ గడపగడపకూ వెళ్లి చెప్పడంతోపాటు విస్తృతంగా ప్రచారం చేసి రేయింబవళ్లు కష్ట పడ్డ కార్యకర్తలందరినీ అభినందించారు. తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడి కాంగ్రెస్, బీజేపీ రాజకీయ వ్యవహారాన్ని ఎండ గట్టారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలోని సయ్యద్ అజ్రత్ ఇమామ్ ఆలీ దుర్వేషావళీ దర్గాను సందర్శించారు. చాదర్‌కప్పి ప్రార్థనలు చేశారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో చౌడాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గంభీరావుపేట మండలం గోరంటాలలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి ఎల్లమ్మ సిద్ధోగానికి హాజరై అక్కడి ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. ఎల్లమ్మ ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఐదు నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, రైతు రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు ₹2500, వృద్ధులకు ₹4 వేల హామీలు నెరవేర్చలేదని మండి పడ్డారు. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర రాష్ట్ర రాజకీయాలను ఓ మలుపు తిప్పిందన్నారు. క్యాడర్ నుంచి లీడర్ల వరకు కేసీఆర్ బస్సుయాత్ర ప్రతి ఒక్కరిలో విశ్వాసం నింపిందన్నారు. కేసీఆర్ పోరుబాటకు ప్రజల నుంచి వచ్చిన ఆదరణ చూసిన తర్వాత, పార్టీ పది కాలాలపాటు చల్లగా ఉంటుందన్న భరోసాతో కార్యకర్తల్లో జోష్ పెంచిందన్నారు. కొత్తగా ఏర్పడ్డ రాజన్న సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తే ప్రభుత్వానికి ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌బాస్కర్ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ముస్తాబాద్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, సీనియర్ నాయకులు చీటి నర్సింగారావు, బొల్లి రామ్మోహన్, ఎండీ సత్తార్, మండల శాఖ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, కోడి అంతయ్య,రాములు పాల్గొన్నారు.

గంభీరావుపేట మండలం గోరంటాల ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిక మొక్కుతున్న కేటీఆర్

ప్రజలంతా మా వైపే నిలిచారు

- పెద్దపల్లిలో బీఆర్ఎస్‌దే విజయం
- పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, పక్కన కోరుకంటి చందర్, గోపు అయిలయ్య యాదవ్

గోదావరిఖని, మే 14: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని, ప్రజలంతా ఉద్యమ పార్టీ వైపే నిలిచారని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరిఖనిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టి ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌పై ప్రజలు కోపంతో ఉన్నారని, ఈ ఎన్నికల్లో ఆ మార్పు కోరుకొని తీర్పు ఇచ్చారని భావిస్తున్నానని చెప్పారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వ్యక్తమైందని, దీనిని ప్రజలు ఓటు రూపంలో చూపించారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకున్న ఫలితాలు వచ్చి గెలుపు సాధించే అవకాశమున్నదని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో ముందుకెళ్లామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు ఎటూ పోలేదన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఓట్లే చీలిపోయి, ఆ మేరకు కాంగ్రెస్ ఓట్లు కొన్ని బీజేపీకి పడి ఉంటాయన్నారు. వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపులో ప్రజా ఆశీర్వాదంతో ఎంపీగా గెలిచినట్లయితే రాష్ట్ర సర్కారు ఇచ్చిన 420 హామీలు అమలయ్యేదాకా పోరాటం చేస్తానని, సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపు, కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు సాధించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ప్రజల పక్షాన నిలబడతానని, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం, రైతాంగం సమస్యలపై నిరంతరం రపోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తన కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పని చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ వంద రోజుల పాలనపై ప్రజలు విసుగు చెందారని, అనేక హామీలు ఇచ్చి మోసం చేయడంతో అసంతృప్తి కనిపించిందన్నారు. కొప్పుల ఈశ్వర్ విజయం దాదాపు ఖాయమైనట్లేనన్నారు. సమావేశంలో నాయకులు మిర్యాల రాజిరెడ్డి, అభిషేక్ రావు, పెంట రాజేశ్, కుమ్మరి శ్రీనివాస్, కృష్ణవేణి, కవితా సరోజని, చిప్ప రాజేశం, మారుతి, బొడ్డు రవీందర్, కిషన్, మురళీధర్, గోపు ఐలయ్య, పీటీ స్వామి, శ్రీనివాస రావు, జావిద్ పాషా ఉన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో అల్ఫోర్స్ హవా

శ్రేయాశ్ రెడ్డిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 14 : సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు హవా కొనసాగించారు. వంద శాతం ఉత్తీర్ణతతో అత్యుత్తమ ప్రతిభ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా, కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల విజయోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చక్కటి ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో విద్యార్థులకు మంచి ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. ఇందులో భాగంగా, 10వ తరగతి ఫలితాల్లో వీ శ్రేయాష్‌రెడ్డి, జే చైత్ర 500 మార్కులకు 493 మార్కులు సాధించి 98.6% తో అగ్రస్థానంలో నిలిచారన్నారు. అలాగే, ఏ అక్షయ 487, ఎం లక్ష్మి సంయుక్త 487, జీ సహస్ర, డీ రుత్విక్, జీ లాస్యశ్రీ 486, జే సరయు, టీ స్వరజ్ఞ 485, తదితరులు మంచి ఫలితాలు సాధించినట్లు చెప్పారు. 219 మంది విద్యార్థులకు 89 మంది విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించారన్నారు. 12వ తరగతి ఫలితాల్లో ఎన్ హేమంత్ 483 మార్కులు సాధించి 96.6% తో అగ్రస్థానంలో నిలవగా, సుబోద్ దరి 476, సాయి మంజునాథ్‌రెడ్డి 476, జీ లహరి 476, వీ శ్రీముఖి 472 మార్కులు సాధించారని చెప్పారు. మొత్తం 12 మంది విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా టీచర్స్ సహకారం మరువలేనిది

సీబీఎస్ఈ ప్రకటించిన ఫలితాల్లో 500 మార్కులకు 493 మార్కులు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ క్రమంలో సీబీఎస్ఈ పదో తరగతిలో 98.6 శాతం మార్కులు రావడం చాలా గొప్ప విషయంగా భావిస్తున్నా. ఇందులో ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. ఎప్పటికప్పుడు సెలబస్‌ను అప్‌డేట్ చేస్తూ, తగిన సలహాలు ఇస్తూ చదవడంతో ఎంతో సహకరించారు. అల్ఫోర్స్‌లో పదో తరగతి, 12వ తరగతితోపాటు ఐఐటీ, నీట్ తరగతుల్లో చాలా బాగా వివరిస్తున్నారు. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా కరీంనగర్ జిల్లాలో జాతీయ స్థాయి పరీక్షలకు శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం.

- వీ శ్రేయాష్‌రెడ్డి, 10వ తరగతి

అభివృద్ధిని మరిచి

సంక్షేమాన్ని వదిలి ప్రజలను భయపెట్టేలా వ్యాఖ్యలు సరికాదు

అరాచకాలు ప్రోత్సహిస్తరా..?

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మాట్లాడుతున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని, మే 14: స్థానిక కాంగ్రెస్ మంత్రి మంథని ప్రాంత అభివృద్ధిని మరిచి అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గ ప్రగతిపై సమీక్షలు చేయకుండా కేవలం బీఆర్ఎస్ నాయకులపై రౌడీ షీట్లు ఎలా ఓపెన్ చేయాలి? ఇక్కడ ఉన్న సంపదను ఎలా తరలించాలి? అనే ఆలోచన మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గుర్తించి, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆపార్టీకి బుద్ధి చెప్పేలా బీఆర్ఎస్‌కు ఓటు ద్వారా మద్దతు తెలిపారని చెప్పారు. పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్ విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. మంథనిలోని రాజగృహలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టిన వ్యక్తి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. 'ఇప్పటి వరకు 35ఎంఎం ట్రయల్ మాత్రమే చూశారని, ముమ్ముందు 70ఎంఎం సినిమా చూపిస్తానని' మాట్లాడడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా చిన్న కాళేశ్వరం పూర్తి చేసేందుకు నిధులు, తాడిచర్ల-భూపాలపల్లి రోడ్డు నిర్మాణం కోసం నిధులు తేవాలన్న ఆలోచన కూడా చేయలేదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టి ఉంటే ఓడేడు వంతెన కూలి పోయేది కాదన్నారు. మంథని నుంచి మొదలు మహదేవపూర్ దాకా ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారని, ఎక్కడ చూసినా ఇసుక దంపులే కనిపిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, ఇక్కడ మంథని ఎమ్మెల్యే ఒక్కటేనని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎంపీ ఎన్నికల సమయంలో రాజ్యాంగం మారుస్తారని విష ప్రచారం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేలా రాజ్యాంగంపై అవగాహన కల్పించే బాధ్యత తామే తీసుకుంటున్నామని వివరించారు. భయానికో.. ప్రలోభాలకో, పదవుల కోసం పార్టీ మారిన వారి ఇంట్లో సైతం రూ.4వేల పెన్షన్ రావాలన్నా, రైతు బంధు రావాలన్నా, ఇతర పథకాలు రావాలన్నా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పోరాటం చేయాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తమ పార్టీలో పదిమంది ఉన్నా పట్టువదలకుండా ప్రజా సమస్యల పరిష్కారం, ఆరు గ్యారెంటీలు అమలయ్యేదాకా పోరాటం చేస్తామన్నారు.